# ఇలాగెందరో?

"ఏమే ఎంతసేపే ఆ సింగారం, టైమయిపోవడంలె! అన్నం పెట్టానురా!" పెద్ద కేకపెట్టింది అమ్మ. సులోచన చేతిలోని అద్దంలో బొట్టు, కనుబొమలు, ముంగురులు చివరిసారిగా చూసుకుని,అద్దం కిటికీలో పెట్టింది. పచ్చని పసిమిలో నున్నగా వున్న నుదుటిమీద మెరుపుల బొట్టు ఎంత బాగుందని! సినిమాల్లో చూపిస్తారే అట్లాంటి అందం తనకీ వుంది. కానీ ఏం లాభం. పల్లెటూళ్లో పడివుంది.సన్నని శరీరం చుట్టూ, ఓణీ అందంగా చుట్టుకొంటే, నిగనిగలాడుతూ ముద్దొచ్చే చిన్న పొట్ట, నడుము. నాన్న యిచ్చిన రూపాయలు స్కూలులో జామకాయలకు, సెనగలకు ఖర్చు పెట్టకుండా దాచుకొని గోళ్లరంగు కొనుక్కుంది. అది జాగ్రత్తగా పూసుకోవడం ఒక పెద్ద కార్యక్రమం. పెదిమలకి రంగు పూసుకోవాలని యిష్టం వుంటుంది. కానీ యింట్లో వాళ్లు తిడతారని, వూళ్లోవాళ్లు నవ్వుతారని భయం.

మూడు కిలోమీటర్ల దూరంలో వున్న వూళ్లో స్కూలుకి వెళ్లడానికి పాపం నాన్న సైకిలు కొనిచ్చాడు. ఊళ్లో మరో ఐదారుగురు ఆడపిల్లలు సైకిళ్లమీద వెడుతున్నారు. పదో క్లాసుకి వచ్చింది కనుక ట్యూషను పెట్టించారు. స్కూలు ఐనాక ఐదుగంటల వరకు లెక్కలు ట్యూషను, సెలవు వస్తే ట్యూషను. ఆదివారాలు లెక్కల క్లాసు.

ఊపిరి సలపకుండా యింత చదువుకుంటున్నా సులోచనకి అందం, షోకులు, రిబ్బన్లు కట్టుకోవడం, పౌడరు మెత్తుకోవడం మీద బలే ధ్యాస. మగపిల్లలు తనవంకే చూస్తున్నారంటే అదో పులకరింత. సినిమాల సీన్లు చూస్తోంటే, అబ్బ ఎంత బాగున్నారో.. ఎంత అందంగా వున్నారో.. అని కళ్లు పెద్దవి చేసి చూస్తూ, కలల్లో కూడా వాళ్లే కనిపిస్తోంటే మురిసిపోతుంటుంది.

ఇల్లాంటి పరిస్థితుల్లో ఆ పక్క వూళ్లోనే కాలేజీలో పని చేస్తున్న ఒక అతను చందు. చలాకీగా సైకిలు మీద స్పీడుగా  రోజూ స్కూలుకి వెళ్లే సులోచనని చూడసాగాడు. షోకుల మీద ఆ పిల్లకి వున్న మోజుని పసిగట్టాడు. ఒకనాడు సైకిలు టైరుగాలిపోయి, నడిపించుకువస్తున్న సులోచనని పలుకరించి, గాలి కొట్టించుకొస్తానని తన సైకిలుతో పాటు గబగబ ముందడుగు వేసి, గాలి కొట్టించాడు. అదే తొలి పరిచయం. వారం పదిరోజుల్లోగా సులోచనకి మదరాసు, బొంబాయి సినిమా వాళ్లవి అడ్రెస్సుల పుస్తకం, కొన్ని సినిమా పత్రికలు అందజేశాడు. మిలమిల మెరిసే కళ్లతో, వాటిని మనసారా చదువుకుంది సులోచన. వాళ్లని చూస్తుంటే తను ఎంత మంది కంటేనో అందంగా ఉంటానని అనిపించసాగింది.

ఆమాటే అన్నాడు చందు. "మీ యింట్లో వాళ్లని అడుగు మదరాసో, హైదరాబాదో పోయి సినిమా ఛాన్సు కోసం ప్రయత్నం చేస్తానని" "అమ్మో చంపేస్తారు" అన్నది సులోచన. "ఐతే నీకు దసరాకి సెలవులిస్తారుగా, ఒక వారం గబుక్కున పోయి వచ్చేద్దాం" చందు చూపిన యీ ఆశ బాగానే పనిచేసింది.

ఔను సినిమాల్లో, టి.వి.ల్లో కనుపిస్తున్న వాళ్లంతా తనకంటే ఏమంత అందంగా వున్నారని! మంచిగా మేకప్ చేస్తే అంతకంటే అందంగా వుంటుంది తను. అమ్మకీ, నాన్నకీ తెలిస్తే చచ్చినా ఇంట్లోంచి కదలనివ్వరు. చాటుగా తన బట్టలు బ్యాగులో పెట్టేసుకుంది. జుంకీలు పెట్టుకుంది చెవులకి. పండుగ రోజులంటూ అమ్మ దగ్గర గారాబం పోయి, గొలుసు అడిగి తీసుకుంది. డబ్బులు మాత్రం ఒక్క యాభై దొరికాయి నాన్న జేబులు తడిమితే. చీకటి పడుతుండగా చందు చెప్పిన చోటికి చేరుకుంది. పెరట్లోకి వెళ్లినట్లు వెళ్లి అటే జారుకుంది. అద్దె సైకిలు తీసుకుని, పొలం గట్ల మీద తొక్కుకుంటూ బస్సు దొరికే వరకు చేర్చాడు చందు. బస్సుపై వూరి నుంచి వస్తోంది కనుక వీళ్లని గుర్తుపట్టినవాళ్లు ఎవరూ లేరు. తెల్లారేసరికి హైదరాబాదు చేరారు. ఎప్పుడెప్పుడు స్టూడియోలకి వెళ్ళిపోతామా, పెద్దహీరోలు కనుపిస్తారా అని ఆత్రుత సులోచనకి.

ఏదో ఒక చవుకబారు లాడ్జిలోకి చేరారు. "నీ దగ్గర డబ్బులు ఎన్ని వున్నాయి?" అని అప్పుడే అడిగాడు చందు. తెల్ల ముఖం వేసి, యాభైరూపాయలున్నాయని యిచ్చింది. అతని ముఖంలో ఛీత్కారం.

"అంటే వూరికే, సినిమా ఛాన్సు వస్తుందనుకున్నావా?" అన్నాడు. రాత్రి బస్సులో నిద్రపట్టలేదు. కడుపులో బెంగగా వుంది. దీనికి తోడు చందూ గదమాయిస్తూ మాట్లాడేటప్పటికి ఏడుపు వచ్చింది సులోచనకి. పరీక్షగా చూశాడు చందూ. "ఆగొలుసు తీసి యివ్వు. తాకట్టు పెడితేనైనా నాలుగొందలు వస్తాయి" అన్నాడు. అతను గుంజుకోకుండా తనే తీసి యిచ్చింది. అది ఎన్ని గ్రాములో, ఎంత ధరో ఏమీ తెలియదు. బయటికి వెళ్లిపోయిన చందూ సాయంత్రమౌతుండగా వచ్చాడు. చీకటి పడుతోంది. లాడ్జి గదిలో రెండు మంచాలున్నాయి. లైటు బాగానే వుంది. రాను రాను దిగులు ఎక్కువైపోతోంది సులోచనకి. చందూరాగానే, "నేను యింటికి వెళ్లిపోతాను, బస్సు ఎక్కించండి" అన్నది.

"ఏడిచావులే. తెల్లారేసరికి నీకు మేకప్ టెస్టు. ఫోటోలు ఒక డజను దిగాలి. మంచి బట్టలున్నాయా? పరికిణీలు, ఓణీలు కాదు. పంజాబీ డ్రెస్సు,మిడ్డీలు వేసుకోవాలి. కొని పట్టుకొస్తాను" అన్నాడు.

అన్నం తిన్నారు. ఏవేవో తియ్యగా చాలా కబుర్లుచెప్పాడు చందూ. పాటలు పాడి వినిపించాడు. ఆమె చేత పాడించాడు. భయం తగ్గి, కొంచెంగా నమ్మకం కలుగసాగింది.

రాత్రి, వంటరి జంట, పలుకరించేవాళ్లులేని లోపల గొళ్లెం వేసుకున్న తలుపు. అందమైన సులోచన. ముందు రోజుల్లో ఆమె గడుపబోయే జీవితానికి తెరలేచింది. అది ఆమె బతుకులో చరమాంకమే. చందూకేమిటి మగవాడు. వయస్సులో వున్న కుర్రాడు. సినిమాలు ఎన్నో చూసి రొమాన్సు, శృంగారం కూడా నేర్చుకొన్నవాడు. దీపం వెలుగులోకి రెక్కలు విదలించి, ఎగిరిన పురుగు బలైపోయింది.

మరునాడు మేకప్ చేయించి, డ్రెస్సులతో ఫోటోలు తీయించాడు చందూ. ఆఫోటోలు ఎటు తీసుకెళ్లాడో తెలియదు.

ఒక్క స్టూడియో ముఖం కూడా చూడకుండానే నలిగి నాశనమైంది సులోచన. మా ఫ్రెండ్సు వున్నారంటూ, సామాను సర్దించి, రూము ఖాళీ చేయించి ఒక ఫ్లాటుకి తీసుకెళ్లి దింపాడు కుకట్‌పల్లిలో.

చందూ గొలుసు విడిపించలేదు. ఎక్కడ అమ్మాడో తెలియదు. అతడు మాయమైపోయాడని తెలియడానికి రెండురోజులు పట్టింది. అతని 'ఫ్రెండ్సు' ఎవరో, ఎల్లాంటివారో, వారు చేస్తున్న

వ్యాపారమేమిటో, ఆ వాటాల్లో వున్న అమ్మాయిలు, వచ్చిపోయే మగవారు - అన్నీ నాలుగు రోజుల్లో అర్థమైనాయి, అలవాటైనాయి.

ఆమె వెనక్కి పోతుందా? పోనిస్తారా? తప్పించుకోవడం చేతనౌతుందా?

అమాయకమైన ఆ బాలిక అమ్మదగ్గరికి చేరేదెప్పుడు? చేరాలని ప్రయత్నిస్తే వారు యింట్లో అడుగుపెట్టనిస్తారా? తన యింటి వారిని, వూరి వారినీ, బడిలోపిల్లల్నీ, టీచర్లను ఎదుర్కొని, వారి ఎదరపడి మాట్లాడగలదా? తల ఎత్తుకు తిరగగలదా?

సిగ్గుమాలిన తనం కాదు. తెంపరితనం కాదు. లోకమెరిగిన గడుసుతనం కాదు. ఘోరంగా మోసపోయిన ఉదంతం యిది.

**- వాస్తవగాథ**